క్లుప్తంగా

వినాయకుని దర్శించుకున్న రెవన్న



రెవన్నకు చిత్రపటం అందిస్తున్న ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని మాజీ ప్రధాన మంత్రి దేవేగౌడ కుమారుడు కర్ణాటక మాజీ మంత్రి రెవన్న ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. రాత్రి స్వామివారి దర్శనార్థం ఆయన విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్లు

పూతలపట్టు: మండలంలో పలుచోట్ల ఆదివారం తెల్లవారుజామున పండగ వాతావరణం నెలకొంది. మండలంలోని ప్రతి పింఛన్ లబ్ధిదారులకు రూ.2,750లు వలంటీర్లు పంపిణీ చేశారు.

విజ్ఞానసుధలో న్యూఇయర్ వేడుకలు



బహుమతిని అందజేస్తున్న చైర్మన్ రాధాకృష్ణమూర్తి

చిత్తూరు కలెక్టరేట్: స్థానిక కొంగారెడ్డిపల్లెలోని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ రాధాకృష్ణమూర్తి, వైస్ చైర్మన్ శ్రీధర్ బహుమతులు అందజేశారు. టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవ్వాతాతల ముఖాల్లో ఆనందం



గుడిపాల: పింఛన్ అందజేస్తున్న వలంటీర్

గుడిపాల: అవ్వాతాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆదివారం ఉదయం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్‌ను కవర్లో అందజేసి ఇస్తుంటే ఎక్కడ లేని సంతోషం వారిలో వ్యక్తమైంది. పెంచి రూ.250 కలిపి రూ.2750 అవ్వ, తాతలకు వలంటీర్లు అందించారు.గతంలో 6,883 మందికి పింఛన్‌లు ఇస్తుండగా, ఆదివారం కొత్తగా 186 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు






డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు నుంచి శుభాకాంక్షలు అందుకుంటున్న ఇన్‌చార్జి కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో, పలు జిల్లా కార్యాలయాల్లో ఆదివారం ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఇంచార్జి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను జెడ్పీచైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, ఆర్డీవో రేణుక తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఏవో కులశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, ఏపీసీ వెంకటరమణారెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి, ఎస్‌సీ వెల్ఫేర్ అధికారిణి రాజ్యలక్ష్మి, వీఆర్‌వోల అసోసియేషన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలాజీరెడ్డి, పండ్ల పరిశ్రమ నిర్వాహకులు గోవర్ధన్‌బాబీ, ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పన్నీర్‌సెల్వం, కలెక్టరేట్ సిబ్బంది, పలు మండలాల తహసీల్దార్లు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డీఈవో కార్యాలయంలో డీఈవో విజయేంద్రరావును యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, పీఆర్‌టీయూ నాయకులు గిరి, ప్రకాశ్‌చంద్రారెడ్డి, కణ్ణన్, ఎస్టీయూ నాయకులు గంటామోహన్, ఎస్‌సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం కలిశారు. డీఈవో చేతుల మీదుగా హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు లింగయ్య, రమేష్, అరుణ్, మోహన్, రమేష్, తులసిబాబు తదితరులు డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. సిబ్బంది మురళి, గోపాల్, నాగరాజు, జయప్రకాశ్ కేక్ కట్ చేశారు.

చిత్తూరు కార్పొరేషన్: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివాసంలో ఆయన పలువురు కలిసి ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా, నియోజకవర్గ అధికారులు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అందులో మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్‌సురేష్, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి నాయకులు అప్పు తదితరులు ఉన్నారు. అదే విధంగా కయినికట్టువీధిలోని బుల్లెట్‌సురేష్ కార్యాలయంలో ఆయనను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు చెబుతున్న బుల్లెట్ సురేష్, అప్పు



ఎస్పీ రిశాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి



కమిషనర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సిబ్బంది

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

గుడిపాల: చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును చిత్తూరులోని ఆయన నివాసంలో గుడిపాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలసి నూతన సంవత్సర శుభాకంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు పుస్తకాలు, బ్యాగ్‌లు, పెన్నులను విద్యార్థుల కోసం తీసుకెళ్లి ఆయనకు అందజేశారు. తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో ఉపేంద్ర, ఎంఈఓ రామ్‌నాయక్ ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్పీ కార్యాలయంలో

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ఎస్పీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. సతీమణి, శాఖ అధికారుల మధ్య ఎస్పీ రిశాంత్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. తరువాత ఎస్పీకి అడిషనల్ ఎస్పీ జగదీష్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డీఎస్పీలు, సీఐలు, ఎస్‌లు కూడా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రికి కమిషనర్ శుభాకాంక్షలు

చిత్తూరు అర్బన్: నగర కమిషనర్ జె.అరుణ ఆదివారం ఉదయం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు దంపతులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఇంచార్జ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ రాజశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు నగరపాలక ఉద్యోగులతో కలిసి చిత్తూరు ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించారు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, నగర మేయర్ ఎస్ అముదను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పలు శాఖల సిబ్బంది కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు వెల్లువ

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్‌రెడ్డిలు కలిసి కేక్‌కట్ చేశా రు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, అనధికారులు, ప్రముఖులు, కార్యాలయాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ తెలిపారు. ఉదయం 10.30 గంటల ప్రజల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలోని వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3–5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందని.. స్థానికంగా ఉన్న ప్రజలు ఆయా సచివాలయాల్లో వినతులు అందచేయవచ్చన్నారు. ప్రజలు ఇంటినుంచే కార్పొరేషన్ కాల్‌సెంటర్ ఫోన్ 08572232745, వాట్సప్‌–9849907885 నంబర్లకు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో

చిత్తూరు రూరల్: చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు సమస్యల వినతులను సమర్పించవచ్చని పేర్కొన్నారు.

పింఛన్‌దారుల్లో నూతనోత్తేజం



పెరిగిన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

ఐరాల: ఎన్నికల సమయం నాటికి ఉన్న రూ.2వేల పింఛన్‌ను దశల వారీగా పెంచుకుంటూ పోతా మని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చి న మాటను నేరవేర్చుకున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఆదివారం కాణిపాకంలో ఈ జనవరి నుంచి రూ.2,750కి పెంచి పెరిగిన పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మోములో చిరునవ్వు కనిపిస్తోందని పేర్కొన్నారు. నూతన సంవత్సరం కానుకగా సామాజిక పింఛన్‌ను పెంచి అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందని తెలిపారు. పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై కొద్దిరోజులుగా దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. లబ్ధిదారులను ఆందోళనకు గురిచేసి రాజ కీయ లబ్ధి పొందాలనుకున్న కుట్రలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పటాపంచల్ చేశారని ,జనవరి నుంచి పింఛన్లు యథావిధిగా మంజూరు చేయడంతో ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం ఉత్తదేనని తేలిపోయిందన్నారు. పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ శాంతి సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

వినాయకుని సేవలో ప్రముఖులు




కాణిపాక ఆలయంలో ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, ఆలయంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు




కుటుంబసభ్యులతో ఎమ్మెల్సీ భరత్, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, లోకాయుక్త జడ్జి జస్టిస్ లక్ష్మణరెడ్డికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఏఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. జనవరి 1వ తేదీ కావడంతో ఉదయం పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, మధ్యాహ్నం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జడ్జి జస్టిస్ లక్ష్మణ రెడ్డి, కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశన్న వరాలే, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కార్తీక్, విశాఖపట్నం ఎమ్మెల్యే వాసుపల్లె గణేష్ కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనానంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఐరాల మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బుజ్జిరెడ్డి, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి పాల్గొన్నారు.



కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏఈఓ



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కార్తీక్






గుడిపాల: దుర్గాలమ్మ ఆలయంలో.., గుడిపాల: నంగమంగళం వద్ద రేణుకాంబ ఆలయంలో.., బంగారుపాళెం: వజ్రాలపురంలో బోయకొండ గంగమ్మ, అర్ధగిరి క్షేత్రంలో ..

ఏడాదంతా శుభాలే జరగాలని..




చిత్తూరు చర్చిలో ఉపదేశమిస్తున్న పాస్టర్‌రెవరెండ్ క్రిప్టిదాస్, హాజరైన క్రైస్తవులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే ఆలయాల్లో జనం క్యూ కట్టారు. నగరంలోని అగస్తీశ్వర ఆలయం, శ్రీవెంకటేశ్వర ఆలయం, దుర్గమ్మ తదితర ఆలయాలన్నీ కిటకిటలాడాయి.కొత్త ఏడాదిలో శుభాలే జరగాలని ప్రార్థించారు. అలాగే టౌన్ చర్చి, బీటీమోమెరియల్‌చర్చి, రీడ్స్‌పేట చాపెల్, తెలుగు లూక్స్ చర్చిల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆరాధనలు జరిగాయి. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మత బోధకులు క్రీస్తు సందేశాలను వివరించారు. అనంతరం పలు సేవ కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలయాలకు పోటెత్తిన జనం

గుడిపాల: గుడిపాల మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరహరిపేట వద్ద ఉన్న శ్రీభద్రకాళమ్మ, బొమ్మసముద్రంలో ఉన్న దుర్గాలమ్మ, నంగమంగళం వద్ద ఉన్న రేణుకాంబ ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ సాగింది. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బంగారుపాళెం: నూతన సంవత్సరం 2023 వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. యువత శనివారం రాత్రి నుంచి నూతన సంవత్సర సంబరాలను నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. అర్ధరాత్రి 12గంటలకు 2022కు వీడ్కోలు పలికి కొత్త సంవత్సరం 2023కి బాణాసంచా పేల్చి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ స్వాగతం పలికి సంబరాలు చేసుకున్నారు. మిత్రులు, కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఘనంగా సంబరాలు

యాదమరి: చిత్తూరులోని పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయంలో నూతన ఆంగ్ల సంవత్సర సంబరాలు ఎమ్మెల్యే ఎఎంస్ బాబు నాయకులు ఆదివా రం ఉదయం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ఆంగ్ల నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల్లో సందడి

మొగిలి శివాలయం, బంగారుపాళెం ముత్యాలమ్మ ఆలయం, ఓంశక్తి ఆలయం, వజ్రాలపురం బోయకొండ, జలకంఠేశ్వరస్వామి ఆలయం, నలగాంపల్లెలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, మొగిలి వెంకటగిరిలోని కోదండరామాలయం, గంగమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు శుభాకాంక్షలు చెబుతున్న జెడ్పీ వైస్ చైర్మన్

అర్ధగిరిలో..

తవణంపల్లె: అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తుల సందడి నెలకొంది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆధ్వర్యంలో అభిషేక పూజలు జరిగాయి. అనంతరం అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా న్యూయర్ వేడుకలు

పూతలపట్టు: మండలంలోని భీమేశ్వర కళాశాల ఆవరణలో న్యూ యర్ వేడుకలను నా యకులు జగదీశ్వర్‌రెడ్డి ఘనంగా ఏర్పాటు చేశా రు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, రాష్ట్ర మొదిలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ పాల్గొన్నారు. అనంతరం కేకు కట్ చేశారు. విందు ఏర్పాటు చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మండలంలోని మద్దులయ్యాగారిపల్లి గ్రౌండ్‌లో దివంగతనేత సుబ్బారెడ్డి జ్ఞాపకార్థంగా ఆదివారం క్రికెట్ టోర్నీని నాయకులు జగదీశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.22,222, రెండవ బహుమతిగా రూ.11,111, మూడవ బహుమతిగా రూ. 5,555 ప్రకటించారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి



విద్యుద్దీపాల అలంకరణలో వరదరాజుల స్వామి ఆలయం

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ ఆలయం వరదరాజులస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించే వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి తెలిపారు. వేకువజామున మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజుల స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి ఉత్తర ద్వారంలో దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. సాయంత్రం స్వామివారికి ప్రాకారోత్సవం ఉంటుందని వివరించారు. యాదమరిలో వెలసిన ఇంద్రవరదుని ఆలయంలో సోమవారం ఉదయం గరుడ సేవ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు పుంగనూరు బాలికలు



రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పుంగనూరు: రాష్ట్రస్థాయి బాలికల త్రో బాల్ జట్టుకు పుంగనూరు ఎంపిక చేసినట్లు శ్రీకృష్ణారెడ్డి చైతన్య ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్, భాస్కర్‌రెడ్డి రాష్ట్రస్థాయి జట్టును అభినందించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఏకాంబరం కుప్పంలో జరిగిన అండర్ –14 బాలికల జట్ల ఎంపికలో తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులను విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

నూతన ఒరవడికి శ్రీకారం



ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డికి పుస్తక సామగ్రి అందజేస్తున్న నాయకులు

చిత్తూరు రూరల్: నూతన సంవత్సర వేడుకల్లో పుష్పగుచ్ఛాలు, గజమాల లాంటి నిరుపయోగ ఆడంబరాలకు బదులు పేద విద్యార్థులకు చేయి అందించడానికి ఆర్టీసీ వైస్ చైర్మెన్ విజయానందరెడ్డి పిలుపునకు అభిమానులు, అనుచరులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున స్పందించారు. న్యూ ఇయర్ విషెస్ చెప్పడానికి ఆయనను కలిసిన ప్రతి ఒక్కరు విద్యార్థులకు పనికొచ్చే పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, జామెట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిల్‌లు అందజేశారు. గతంలో సుమారు కోటిన్నర రూపాయల సొంత నిధులతో రెండు సంవత్సరాలపాటు మార్కెట్ వేలం పాటను చేజిక్కించుకొని రైతులకు, వీధి వర్తకులకు ఎలాంటి గేట్ లేకుండా చేసిన విజయానందరెడ్డి, నీవానది వరద ప్రాంతంలో పెద్ద ఎత్తున సహాయక చర్యలు కూడా చేపట్టారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా వీధి వర్తకులకు సాయం చేయడంతోపాటు మెగా రక్తదానం నిర్వహించారు. నూతన వేడుకల్లో ఖర్చులకు తావివ్వకుండా పేద విద్యార్థులకు ఆపన్నహస్తం అందించడంపై హర్షం వ్యక్తం అయ్యింది.